సాక్షి విశాఖపట్నం

శనివారం । 1 । జూన్ । 2024



బడి తెరిచిన రోజునే విద్యాకానుక 10లో



పొగాకు నియంత్రణకు పటిష్ట చర్యలు 10లో



ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు 10లో

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఏయూక్యాంపస్: పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలైన ఓట్లకు అనుగుణంగా టేబుళ్లను ఏర్పాటు చేయాలని, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతీ టేబుల్ వద్ద కేటాయించిన సిబ్బంది వారీగా కుర్చీలు వేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ పటిష్టమైన మెస్ ఏర్పాటు చేయాలని, ఏజెంట్లు కూర్చునేందుకు అనుగుణంగా కుర్చీలు వేయాలన్నారు. ఆయన వెంట నగర పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద్



దాబాగార్డెన్స్: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది డాక్టర్ శివానంద్‌కు అభినందనలు తెలిపారు. ఇటీవల కేజీహెచ్‌లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ లాంగ్ లీవ్‌లో ఉన్న దృష్ట్యా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణికి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డాక్టర్ శివానంద్ కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు.

విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఐజీ



మాట్లాడుతున్న ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌తో కలసి జైలు లోపల ఖైదీలు ఉండే బేరక్‌లు, లోపల పరిసరాలు, పారిశుద్ధ్యం పరిస్థితి, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. బేరక్‌లలో ఉన్న ఖైదీలతో ఆయన నేరుగా మాట్లాడి వైద్య సదుపాయాలు, భోజనం, వసతి గురించి ఆరా తీశారు. నిబంధనల ప్రకారం ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఖైదీలు క్రమశిక్షణతో ఉండాలని చెప్పారు. అనంతరం జైలు సమావేశం మందిరంలో నిర్వహించిన కోస్తా ఆంధ్రా అధికారుల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన జిల్లా సబ్ జైల్ అధికారి బత్తిలి కృష్ణారావును అభినందించారు. ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. కృష్ణారావు సేవలను కొనియాడారు. జైలులో ఉద్యోగం చేసే వారు సేవా భావంతో మెలగాలని కోరారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

మురళీనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ సజావుగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు గైస్‌లో 59,001-67,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 67,001-75,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 59,001-75,000 ర్యాంకుల విద్యార్థులు హాజరయ్యారు. గైస్‌లో 187 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 250 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 70 మంది సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ ఎన్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. శనివారం గైస్‌లో 75,001-83,500, కంచరపాలెంలో 83,501-92,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 75,001-92,000 ర్యాంకుల విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుంది. ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ముచ్చెమటలు.. ముప్పతిప్పలు!



చెట్టు నీడలో..



చలివేంద్రంలో మజ్జిగ తాగుతున్న కార్మికుడు

- ఉక్కపోతకు ఎండవాత కూడా తోడు
- మరో మూడు రోజులు తప్పని అవస్థలు
- గాలిలో అధిక తేమ శాతమే కారణం
- అవిశ్రాంతంగా తిరుగుతున్న ఫ్యాన్లు, ఏసీలు

సాక్షి, విశాఖపట్నం : నైరుతి రుతుపవనాల ఆగమనం, రోహిణి కార్తె నిష్క్రమించే వేళ ఉక్కపోత, ఎండవాత ఏకమై జనాన్ని అవస్థల పాల్జేస్తున్నాయి. రేయింబవళ్లు ముచ్చెమటలు పోయిస్తూ ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఒకపక్క వడగాడ్పులు వీస్తుండగా, మరోపక్క ఉక్కపోత ఊపిరి సలపనీయడం లేదు. ఉదయం నుంచి అర్ధరాత్రి దాటినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు ఉండడం లేదు. అన్ని వయసుల వారూ చెమటతో తడిసి ముద్దవుతూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ప్రతి ఇంట్లోనూ 24 గంటలూ ఫ్యాన్లు, ఏసీలు అవిశ్రాంతంగా తిరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఉక్కపోత, చెమటల నుంచి ఉపశమనం లభించడం లేదు. ఇంట్లో ఉన్నా, పనులపై బయటకు వచ్చినా జనం ఉక్కిరిబిక్కిరి అవుతూనే ఉన్నారు. గడిచిన కొన్నేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని వాతావరణ నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి గాలిలో తేమ అధికంగా ఉండటమే కారణమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో గాలిలో తేమ 70-80 శాతం వరకు నమోదవుతోంది. శుక్రవారం ఇది మరింత అధికమైంది. గాలిలో తేమ వాల్తేరులో 80 శాతం, విశాఖ ఎయిర్‌పోర్టులో 81 శాతం రికార్డయింది. ఫలితంగా ఇటీవల రోజులకంటే శుక్రవారం ఉక్కపోత తీవ్రత మరింత అధికంగా కనిపించింది. రానున్న రెండు, మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది.

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
విశాఖపట్నం	ఆనందపురం	41.8
విశాఖపట్నం	పద్మనాభం	41.8
విశాఖపట్నం	పెందుర్తి	39.4
విశాఖపట్నం	విశాఖ రూరల్	39.0
విశాఖపట్నం	విశాఖ అర్బన్	39.0
అనకాపల్లి	రావికమతం	42.1
అనకాపల్లి	కోటవురట్ల	41.8
అనకాపల్లి	మాకవరపాలెం	41.8
అనకాపల్లి	రోలుగుంట	41.3
అనకాపల్లి	కె.కోటపాడు	40.8
అనకాపల్లి	చోడవరం	40.8
అనకాపల్లి	దేవరాపల్లి	40.8



బాబోయ్ ఎండలు..

కొనసాగుతున్న ఉష్ణతాపం

మరోవైపు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణతాపం కొనసాగుతూనే ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40-44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంది. శుక్రవారం అల్లూరి జిల్లా కూనవరంలో అత్యధికంగా 44 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1, విశాఖపట్నం జిల్లా ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 41.8 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతల తీవ్రత కొనసాగనుంది.

కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం

- లెక్కింపు కేంద్రాల్లో 134 సీసీ కెమెరాలు
- స్ట్రాంగ్ రూమ్ నుంచి లెక్కింపు కేంద్రాల వరకు ప్రతి చోటా ఏర్పాటు
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు
- లెక్కింపు ప్రక్రియ పరిశీలనకు ఆరుగురు పరిశీలకులు రాక

విశాఖ సిటీ : నరాలు తెగే ఉత్కంఠకు మరో మూడు రోజుల్లో తెరపడనుంది. ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. లెక్కింపు జరిగే ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పరిశీలనకు ఆరుగురు పరిశీలకులు రానున్నారు.

134 సీసీ కెమెరాలు

ఏయూలో స్ట్రాంగ్ రూమ్ నుంచి లెక్కింపు కేంద్రాల వరకు అన్ని ప్రాంతాల్లోను నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో మొత్తంగా 134 సీసీ కెమెరాలు ద్వారా లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు లెక్కింపు కేంద్రాలకు తీసుకురావడం, లెక్కింపు అనంతరం భద్రపరిచే వరకు అన్నీ రికార్డు కానున్నాయి. ఎక్కడా ఎటువంటి అపోహలు, సందేహాలకు అవకాశం లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తొలి ఫలితం పశ్చిమ

పోస్టల్ బ్యాలెట్‌తో పాటు ఈవీఎంల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్లకు వేర్వేరుగా లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈవీఎంల కౌంటింగ్‌కు 202 టేబుల్స్ ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల సమయానికి విశాఖ పశ్చిమ నియోజకవర్గం తొలి ఫలితం వెలువడే అవకాశముంది. చివరిగా భీమిలి ఫలితం కోసం మాత్రం రాత్రి 8.30 వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుంది. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఎన్నికల అధికారులు ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎక్కడా ఎటువంటి అపశ్రుతులు దొర్లకుండా పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియను ముగించడానికి అధికారులు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

ర్యాలీలు, ఊరేగింపులు రద్దు

- ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా హెచ్చరించిన కలెక్టర్ మల్లికార్జున
- జిల్లాలో 3 నుంచి 6 వరకు 144 సెక్షన్ అమలు

విశాఖ సిటీ : కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈనెల 4న కౌంటింగ్, ఫలితాల వెల్లడి నేపథ్యంలో అందరూ శాంతియుతంగా వ్యవహరించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించకూడదని హెచ్చరించారు. జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 144 సెక్షన్ విధిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. విజేతలు గానీ, వారి అనుచరులు గానీ విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఫలితాల వెల్లడి సమయంలో శాంతి భద్రతల నిర్వహణ కోసం తన అధికార పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, ప్రాంతాల్లో 1973 నాటి యూ/ఎస్ 144(2) సీఆర్పీసీ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.

144 సెక్షన్‌తో ఇవి చేయకూడదు

- ఐదుగురు వ్యక్తులతో చట్టవిరుద్ధమైన సమావేశాలు చేయకూడదు.
- జిల్లా అధికార పరిధి అంతటా ఏ విధమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని బహిరంగంగా ప్రదర్శించకూడదు.
- కౌంటింగ్ ప్రాంగణానికి సమీపంలో ప్రభుత్వ విధులు నిర్వహించే అధీకృత సిబ్బంది మినహా ఇతరులెవరూ ఆయుధాలు కలిగి ఉండడానికి వీలు లేదు.
- ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన పూర్తయ్యే వరకు కౌంటింగ్ కేంద్రం ఆవరణలో ఎలాంటి ఊరేగింపు, నినాదాలు చేయడం, సంబరాలకు గానీ, పబ్లిక్ అడ్రస్ సిస్టం, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించడానికి గానీ వీలులేదు.
- కౌంటింగ్ కేంద్రం నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో జెండాలు, లాఠీలు, మారణాయుధాలు, కర్రలు కలిగి ఉండానికి గానీ, ఊరేగింపులు లేదా పెద్ద సమావేశాలు నిర్వహించడానికి వీలులేదు.
- ఓట్ల లెక్కింపు రోజున రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా పేల్చడం, కాల్చడం పూర్తిగా నిషేధం.
- జిల్లాలో ఫలితాల ప్రకటన తర్వాత ఏ అభ్యర్థి, రాజకీయ పార్టీల విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు.
- సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని స్వీకరించడానికి గెలిచిన అభ్యర్థి లేదా వారి ప్రతినిధితో పాటు ఇద్దరు వ్యక్తుల కంటే ఎక్కువ మందికి అనుమతి లేదు.
- కౌంటింగ్ ప్రాంగణంలోకి వాహనాలను అనుమతించరు. మూడంచెల భద్రతా ప్రమాణాలకు లోబడి మూడవ లేయర్‌కు అవతలే నిలపాలి.

కౌంటింగ్ హాల్ ప్రాంగణంలో వర్తించే షరతులు

- జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారి జారీ చేసిన చెల్లుబాటు అయ్యే ఐడీ కార్డులు, కార్ పాస్ ఉన్న వ్యక్తులు మాత్రమే ప్రాంగణంలోకి ప్రవేశించడానికి అనుమతి ఉంటుంది.
- కౌంటింగ్ కేంద్రం లోపలకు మొబైల్ ఫోన్ తీసుకెళ్లడానికి వీలులేదు. ఈ ఉత్తర్వులు ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు అమలులో ఉంటుంది.
- ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై 188 ఐపీసీ ప్రకారం చర్యలు తీసుకుంటారు.

ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో నిర్వహిస్తున్న బీఎస్సీ(హానర్స్), ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ ప్రోగ్రాంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో 40 మందికి ప్రవేశం కల్పిస్తామని, కోర్సు ఫీజుగా రూ.65 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని, 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 14వ తేదీన కౌన్సెలింగ్ జరిపి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. నూతన విద్యా విధానం 2020లో పేర్కొన్న విధంగా ఈ కోర్సుకు మల్టీ ఎంట్రీ, ఎగ్జిట్ ఆప్షన్‌ను కల్పిస్తున్నారు. ఒక ఏడాది కోర్సు పూర్తి చేస్తే సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు కోర్సు పూర్తిచేస్తే డిప్లమా, మూడు సంవత్సరాల కోర్సు పూర్తిచేస్తే బ్యాచలర్ డిగ్రీ, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తి చేస్తే హానర్స్ డిగ్రీ, ఐదు సంవత్సరాలు పూర్తిచేస్తే ఎమ్మెస్సీ డిగ్రీని అందిస్తారు. ఇంటర్ ఎంపీపీ, బైపీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని సూచించారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: కౌంటింగ్ రోజున నగరంలోని అన్ని సున్నిత ప్రాంతాల్లో సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయాలని సీపీ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఉన్నతాధికారులు, లీగల్ అడ్వైజర్‌తో పాటు ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించి, కౌంటింగ్ రోజున అభ్యర్థులు, ఇతర సంబంధిత వ్యక్తులు ప్రయాణం చేసే మార్గాలు, ఏయూ లోపలకు ప్రవేశించే మార్గాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కౌంటింగ్‌కు ముందు నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించి, నగరంలో ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు దోహదపడాలని సూచించారు.

- ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న బైండోవర్ చేసిన రౌడీ షీటర్స్‌పై పూర్తి నిఘా ఉంచాలి. ఎప్పటికప్పుడు వారి హాజరును, ప్రవర్తనను తనిఖీ చేయాలి.
- నేరస్తులను పట్టుకోవడంలో, నేరాల నియంత్రణకు ఉపయోగపడే సీసీ టీవీ కెమెరాలు ప్రతి ఎస్‌హెచ్‌ఓ తమ స్టేషన్ పరిధిలో అన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.
- నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు.
- మహిళలపై వేధింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసులలో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలి. పోక్సో కేసులపైన ఆరా తీశారు.
- నగరంలో క్రైమ్ రేటు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలి. రాత్రి విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ట్యాబ్ తీసుకొని, తమ లొకేషన్ తెలిసే విధంగా ఉండాలి.

అంధుల జీవితాల్లో ఆశాకిరణం

- అంధ బాలికలకు విశాఖలో ప్రత్యేక పాఠశాల
- ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక విద్యాలయం
- చదువులతో పాటు ఆటల్లోనూ రాణించేలా తర్ఫీదు
- అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో ఆడిన పాఠశాల విద్యార్థిని
- రాష్ట్రంలో ఏ జిల్లా వారైనా ఇక్కడ చేరే అవకాశం
- 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వసతి గృహంలో విద్యార్థినులకు పసందైన విందు భోజనం



సాగర్‌నగర్‌లోని అంధబాలికల పాఠశాల

విశాఖ విద్య: అంధ బాలికల చదువులకు బీచ్‌రోడ్‌లోని పాఠశాల భరోసాగా నిలుస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, హిందూపూర్‌లో పాఠశాలలు నిర్వహిస్తుండగా.. విశాఖలో బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన వారైనా ఇక్కడి పాఠశాలల్లో చదువుకోవచ్చు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల 40 శాతంకు పైగా అంధత్వం కలిగిన బాలికలు ఇక్కడ చేరేందుకు అర్హులు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో 100 మంది సామర్థ్యం కాగా.. ఇప్పటికే 52 మంది బాలికలు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల్లో భాగంగా మిగిలిన 48 మంది సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

సువిశాల విస్తీర్ణంలో..

సముద్ర తీరానికి అనుకుని(బీచ్ రోడ్) మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల కొనసాగుతోంది. అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా ఇచ్చే యూనిఫాంలతో పాటు విద్యా కానుక వీరికి అందిస్తున్నారు. అంధ విద్యార్థినులు చదువులతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది. పాఠశాలలో క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తుండటంతో.. విద్యార్థినులు చెస్, వెయిట్ లిఫ్టింగ్ వంటి పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు.

పది ఫలితాల్లో రికార్డు

పాఠశాల విద్యార్థినులు కొన్నేళ్లుగా 10వ తరగతిలో శతశాతం ఫలితాలు సాధిస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో ప్రభుత్వం సరఫరా చేసిన బెయిలీ లిపితో ముద్రించిన పుస్తకాలను వినియోగిస్తూనే.. అధునాతన పరికరాలతో ఇక్కడి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. నాన్ వెర్బల్ డెస్క్‌టాప్ అసిస్టెంట్(ఎన్‌వీడీఏ) విధానం ద్వారా కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే శబ్దాలను అనుసరించి సరికొత్త పాఠ్యాంశాలను నేర్చుకుంటున్నారు. డైజీ ప్లేయర్లో రికార్డు చేసిన పాఠ్యాంశాలను వింటూ చదువుల్లో ముందుకెళ్తున్నారు. బ్రెయిలీ లిపితో నిక్షిప్తమైన 'అని సిస్టమ్స్'(డివీస్ సంస్థ స్పాన్సర్) విద్యార్థినులకు ఎంతగానో ఉపయోయపడుతున్నాయి.

భద్రతతో కూడిన విద్య

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా పాఠశాలలో విద్యార్థినులకు భద్రతతో కూడిన చదువులు అందిస్తున్నాం. మేము కూడా వారిలాంటి వారిమే కాబట్టి, మా బిడ్డల్లా చూసుకుంటూ వారి భవిష్యత్‌కు పాటుపడుతున్నాం. పాఠశాలలో గతంలో కన్నా బాగా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రాష్ట్రంలోని ఎక్కడ వారైనా స్కూల్లో చేర్చుకుంటాం.

– జి.తిరుమల ప్రసాద్, ప్రిన్సిపాల్, అంధ బాలికల ఆశ్రమ పాఠశాల

జీరో శాతం మరణాలే లక్ష్యం



ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్



ట్రాఫిక్ వలంటీర్లకు కేటాయించిన బైక్‌లను ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్
- రోడ్డు ప్రమాదాల నివారణకు 'ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్'
- తొలుత షీలానగర్-పాతగాజువాక మధ్య ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదాల్లో '0' శాతం మరణాలే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. నగర పరిధిలో మొదటిసారిగా పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ అనే కార్యక్రమానికి శుక్రవారం సీపీ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాతగాజువాక జంక్షన్‌లో అవుట్ పోస్టు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో నిత్యం కనీసం ఒకరు లేదా ఇద్దరు ప్రాణాలు కోల్పోతున్నారని, అనేక మంది గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నగరంలో యాక్సిడెంట్ జోన్లను మ్యాపింగ్ చేసినట్లు వెల్లడించారు. ఇందులో అత్యంత సమస్యాత్మక యాక్సిడెంట్ జోన్ షీలానగర్ నుంచి పాతగాజువాక మధ్య తొలిసారిగా ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు.

ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్‌లో ఏం చేస్తారు?

ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా 15 మంది వలంటీర్లను ఎంపిక చేశారు. వారికి ట్రాఫిక్ రూల్స్‌పై 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ద్విచక్ర వాహనాలను అందజేశారు. యాక్సిడెంట్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిని గుర్తించి.. ప్రమాదాలు జరగకుండా చూడడం వలంటీర్ల విధి. ప్రస్తుతం షీలానగర్ నుంచి గాజువాక మధ్య వీరి విధులు నిర్వర్తిస్తూ.. ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షిస్తారని సీపీ రవిశంకర్ వివరించారు. ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమానికి ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ వైజాగ్ చాప్టర్ సహకారం అందజేసిందని ఆయన తెలిపారు. వైజాగ్ చాప్టర్ అధ్యక్షుడు శ్రీనివాస్ చిట్టూరి మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఏడాది కిందట సీపీతో మాట్లాడానని, ప్రమాదాల నివారణకై ఎటువంటి చర్యలు చేపట్టినా తమ వంతు సహకారం ఉంటుందని తెలియజేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కమ్యూనిటీ గార్డులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ట్రాఫిక్ వలంటీర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నగర సంయుక్త పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ-2 మేకా సత్తిబాబు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, ఏసీపీలు త్రినాథ్, వాసుదేవ్, అన్నెపు నరసింహమూర్తి, రాజీవ్ కుమార్, సీఐలు కోటేశ్వరరావు, షణ్ముఖరావు నాగరాజు, ఎర్రంనాయుడు, శ్రీనివాస్, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పరిణామాలపై కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ సిటీ: కేజీహెచ్‌లోని వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమావేశమయ్యారు. పరిపాలనా విభాగంలో ఇటీవల జరిగిన పరిణామాలు, చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో శుక్రవారం కాన్ఫరెన్స్ హాలులో వివిధ అంశాలపై సమీక్షించారు. నియమ, నిబంధనలకు లోబడి అందరూ పనిచేయాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మంచి పనితీరు కనబరిచి రోగులకు ఉత్తమ సేవలందించాలని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. శివానంద్, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో విచారణ

కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌పై నమోదైన లైగింక వేధింపుల కేసుపై వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం విచారణ చేపట్టారు. తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని సూపరింటెండెంట్‌పై కేజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ అయిన విజయలక్ష్మి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాస్తవాలను విచారించేందుకు పోలీసులు కేజీహెచ్‌కు వెళ్లి గైనిక్ వార్డులోను, ఇతర అధికారులతో మాట్లాడారు. అలాగే ఈ వ్యవహారంపై కలెక్టర్ ఎ.మల్లికార్జున కూడా సీరియస్‌గా ఉన్నారు. ఈ ఫిర్యాదులో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు శాఖాపరమైన విచారణ చేయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సీపీ సత్కారం


ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కరించిన సీపీ రవిశంకర్

విశాఖ సిటీ : పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఎనిమిది మందికి విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సత్కరించారు. సీటీసీ సీఐ ఎ.విశ్వేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ షేక్ యూసఫ్, న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పెద్దాడరాజు, స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్ ఎస్ఐ ఆర్.మల్లేశ్వరరావు, ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.గంగాధరరావు, కంచరపాలెం ట్రాఫిక్ ఏఎస్ఐ ఎ.లక్ష్మణరావు, వన్‌టౌన్ ట్రాఫిక్ ఏఎస్ఐ కె.సత్యనారాయణ, పీఎంపాలెం క్రైమ్ ఏఎస్ఐ వి.సత్యారావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. వీరిని సీపీ తన కార్యాలయానికి ఆహ్వానించి వారి కుటుంబసభ్యులు, పోలీస్ అధికారుల సమక్షంలో శాలువాతో సత్కరించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.

నేడు,రేపు ఆర్గానిక్ మామిడి పండ్ల సంత

మద్దిలపాలెం: సహజ సిద్ధంగా పండించి ముగ్గించిన వివిధ రకాల జాతుల మామిడి పండ్లను విశాఖ ప్రజలకు అందించాలని ఆలోచనతో మామిడి పండ్ల సంతను జూన్ 1,2 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలు శివాజీపాలెంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ప్రతి నెల చేసే సేవా కార్యక్రమంలో భాగంగా రైతులను ఆదుకోవడానికి ఈ నెల మామిడి పండ్ల సంతను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంత ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ ఉంటుందన్నారు.

నడి వేసవిలో నారాయణ

- బరితెగించిన నారాయణ యాజమాన్యం
- వేసవిలోనూ తరగతుల నిర్వహణ
- గత నెల 20 నుంచి రెండు పూటలా తెరిచిన పాఠశాల
- వడగాల్పులతో అల్లాడుతున్న విద్యార్థులు
- అనుమతుల్లేకున్నా సీబీఎస్ఈ సిలబస్ బోధన
- ఆనందపురం మండల అనుమతులతో నగరంలో నిర్వహణ
- విచారణ చేపట్టిన విద్యాశాఖాధికారులు


ఆటో నుంచి పాఠశాల వద్ద దిగుతున్న విద్యార్థులు


పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం బరి తెగించింది. విద్యా వ్యాపారమే ధ్యేయంగా నిబంధనలకు నీళ్లొదిలింది. వేసవిలో పాఠశాలలు తెరవవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. అంతా మా ఇష్టమంటూ విశాఖ నగరంలోని సీబీఎం కాంపౌండ్ ఏరియాలోని నారాయణ స్కూల్‌లో దర్జాగానే తరగతులు నిర్వహిస్తోంది. కొంతమంది తల్లిదండ్రుల సమాచారం మేరకు 'సాక్షి'శుక్రవారం పరిశీలన చేయగా ఆటోలు, ఇతర వాహనాల ద్వారా విద్యార్థులు వస్తూ, పాఠశాలలోకి వెళ్లడం కనిపించింది. విద్యార్థులు పుస్తకాల బ్యాగుతో పాటు మధ్యాహ్న భోజనం క్యారేజీలను సైతం తెచ్చుకోవడాన్ని బట్టి ఇక్కడి పాఠశాల రెండు పూటల నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గత నెల 20 నుంచి పాఠశాల నిర్వహిస్తున్నారని పలువురు విద్యార్థులు తెలిపారు. ఎండ తీవ్రతతో వడగాల్పులు వీస్తున్న తరుణంలో విద్యార్థులను స్కూల్‌కు రప్పించి, తరగతులు నిర్వహిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుర్తింపుపై అనుమానాలు

సీబీఎం కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌కు ప్రభుత్వ పరంగా ఉన్న గుర్తింపుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో నిర్వహించేందుకని అనుమతులు తీసుకుని.. నగరంలోని హై ప్రొఫైల్ ఏరియాగా గుర్తింపు ఉన్న సీబీఎం కాంపౌండ్‌లో స్కూల్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లన్నీ యు–డైస్ కోడ్‌తో నమోదై ఉండాలి. విశాఖ నగరంలోని ప్రకాశరావు పేట స్కూల్ కాంప్లెక్ పరిధిలోకి వచ్చే సీబీఎం ఏరియా పాఠశాలల జాబితాను పరిశీలిస్తే.. ఇప్పటి వరకు సాగిన లొసుగుల వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రంగంలోకి దిగిన విద్యాశాఖాధికారులు

సీబీఎం కాంపౌండ్ ఏరియాలో నారాయణ స్కూల్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు రంగంలోకి దిగారు. ఆర్జేడీ విజయ భాస్కర్ ఆదేశాలతో డీఈవో ఎల్.చంద్రకళ సూచనల మేరకు డిప్యూటీ డీఈవో సువర్ణ, మహరాణిపేట ఎంఈవో పైడపునాయుడు శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విద్యార్థులు స్కూల్‌కు ఎందుకు వచ్చారనే దానిపై పూర్తి స్థాయిలో నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించడానికి వీల్లేదు. అలాంటి వాటిపై కఠినంగానే వ్యవహరిస్తాం. సీబీఎస్ఈ గుర్తింపు లేకుండా ఆ పేరుతో పాఠశాల యాజమాన్యాల వారు విద్యార్థులను చేర్చుకోవద్దు. ప్రైవేట్ పాఠశాలన్నింటికీ తప్పనిసరిగా గుర్తింపు ఉండాలి. దీనిపై మండల స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా ఆదేశాలిచ్చాం.

– బి.విజయ భాస్కర్, ఆర్జేడీ, విశాఖపట్నం

కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిందే..

ప్రైవేటు పాఠశాలకు టెక్నో, ఒలింపియాడ్, ఐకాన్ వంటి పేర్లతో ప్రచారం చేయకూడదనే నిబంధన ఉంది. కానీ సీబీఎం కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న పాఠశాలకు మెడికాన్ పేరుతో విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. బైపీసీ క్యాంపస్‌గా పాఠశాల యాజమాన్యం ప్రచారం చేస్తూ తల్లిదండ్రుల ఆశలతో విద్యా వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఐకాన్ మెడికాన్, సీవో అంటూ పాఠశాల స్థాయిలోనే విభజిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారు.

గుర్తింపు లేని పాఠశాలల జాబితా వెల్లడించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

విశాఖ విద్య: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల జాబితాను విద్యాశాఖాధికారులు వెల్లడించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుర్తింపు లేని పాఠశాలల్లో చేరితే, విద్యార్థులు భవిష్యత్ చదువులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ విషయాన్ని ముందుగానే అందరికీ తెలిసేలా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల జాబితాను బహిర్గతం చేయాలన్నారు. అందులో వేటికి గుర్తింపు ఉంది, ఏ స్కూళ్లకు గుర్తింపు లేదనేది తెలియజేయాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేటు స్కూళ్లు గుర్తింపు లేకుండానే నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్క విద్యార్థికి నష్టం కలగకుండా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అండగా ఉంటుందన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,760
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,700
వెండి(కిలో):	రూ.1,00,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

విశాఖ ఉక్కు కర్మాగారం రుణం తీర్చుకోలేనిది

- మస్తానప్ప దంపతులు


స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నమస్కారం చేస్తున్న మస్తానప్ప దంపతులు

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారం రుణం తీర్చుకోలేనిదని స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప, వరలక్ష్మి దంపతులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ నుంచి శుక్రవారం ఆయన పదవీ విరమణ చేసిన అనంతరం వైఎస్సార్ టీయూసీ, నాయకులు, కుటుంబ సభ్యులతో ఇంటికి బయల్దేరారు. బయటకు వచ్చిన సమయంలో వారు స్టీల్‌ప్లాంట్ గేటుకు నమస్కారం చేసి.. ఉద్వేగభరితులయ్యారు. ఈ సందర్భంగా మస్తానప్ప మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం నుంచి కార్మిక నాయకుడిగా మారే అవకాశం ఉక్కు కర్మాగారం కల్పించిందన్నారు. దాలినాయుడు, అప్పలరెడ్డి, నల్లమల్లి శ్రీనివాసరెడ్డి, బి.రామకృష్ణ, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

కొమ్మాది: రాష్ట్ర స్థాయి 9వ రగ్బీ జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం తిమ్మాపురంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రగ్బీ గేమ్‌లో వేగవంతం, క్రీడాకారుల దమ్ము కనిపిస్తోందన్నారు. క్రీడాకారులు పోటీల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. అనంతరం 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. బాలికల క్వార్టర్ ఫైనల్స్‌కు అనంతపూర్, కర్నూలు, ప్రకాశం, ఈస్ట్ గోదావరి, గుంటూరు జట్లు చేరాయి. బాలుర విభాగం నెల్లూరు, కర్నూలు, శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం, తూర్పు గోదావరి జట్లు చేరాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. రామాంజనేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి లలిత్ కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బడి తెరిచిన రోజునే విద్యాకానుక

- స్కూళ్లకు పుస్తకాలు సకాలంలో సరఫరా
- ఆర్జేడీ విజయభాస్కర్

విశాఖ విద్య/గాజువాక : బడి తెరిచిన రోజునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ విద్యాకానుక అందించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి శుక్రవారం గాజువాకలోని ఉమ్మడి విశాఖ జిల్లా పుస్తకాల నిల్వ గోదామును పరిశీలించారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు వచ్చాయి, ఎంత మేర మండలాల్లోని స్టాక్ పాయింట్లకు సరఫరా చేశారనే విషయాలను గోదాము మేనేజర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గోదాములో పుస్తకాలను భద్రపరచడంలో తీసుకుంటున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు 14,66,883 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా మే 31 వరకు 9,16,691 వచ్చినవని అధికారులు వివరించారు. వీటిలో 7,03,154(76 శాతం) మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేయటం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు 45 శాతం, అనకాపల్లి జిల్లాకు 48 శాతం, విశాఖపట్నం జిల్లాకు 47 శాతం పాఠ్యపుస్తకాలను సరఫరా చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ సరిపడా పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు సరఫరాచేసేలా తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏ ఒక్క విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందలేదనే మాట రాకూడదన్నారు. పర్యటనలో సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో


రిటైల్ ఎక్స్‌పోలో యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ షాలిని మీనన్

విశాఖ సిటీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవనంలో శుక్రవారం రిటైల్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ బిల్డర్లు, వాహన డీలర్లు, విద్యా రుణాల ఏజెన్సీలు పాల్గొని వారి వాణిజ్య విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ షాలిని మీనన్, డిప్యూటీ జోనల్ మేనేజర్ శంకర్ హేమ్‌రామ్, రీజనల్ మేనేజర్ నరసింహకుమార్ పాల్గొని బ్యాంక్ రిటైల్ రుణాల గురించి వివరించారు.

3న జిల్లా జోన్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

తగరపువలస: విజయవాడలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరగనున్న జూనియర్ బాయ్స్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ కోసం విశాఖ జోన్ టీమ్ ఎంపిక ఈనెల 3వ తేదీన కొమ్మాది విజ్ఞాన్ గ్రౌండ్‌లో జరగనుంది. 2009 జనవరి 1 నుంచి 2010 డిసెంబర్ ఒకటి మధ్య జన్మించిన బాలురు ఆ రోజు ఉదయం 8 గంటలకు హాజరుకావలసి ఉంది. జిల్లాలోని అన్ని ఫుట్‌బాల్ క్లబ్‌లకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు వారి క్రీడాకారులను ఈ ఎంపికలకు పంపించాలని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చిన బాబు కోరారు. వివరాలకు 92481 43143 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పొగాకుతో కుటుంబాలు ఛిన్నాభిన్నం


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో పూర్ణేంద్రబాబు

విశాఖ సిటీ: పొగాకు జీవితాన్నే కాకుండా కుటుంబాన్నే ఛిన్నాభిన్నం చేస్తుందని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆయన జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సిగరెట్, తంబాకు వినియోగించడం ఫ్యాషన్ కాదని, అది మరణానికి దారిగా హెచ్చరించారు. అందుకే భారత ప్రభుత్వం బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వినియోగాన్ని నిషేధించిందని గుర్తుచేశారు. పొగాకు, ధూమపానం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఏటా మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధూమపానం కారణంగా హృదయనాళ, జీర్ణ వ్యవస్థ, చర్మ ఆరోగ్యం, పునరుత్పత్తి వ్యవస్థ దెబ్బతినడంతో పాటు అంధత్వానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత మాట్లాడుతూ పొగాకు నియంత్రణ కోసం అన్ని శాఖలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ పంచాయతీ సభ్యులు, ఎన్‌జీవో సంస్థలు, రైతులు, యువత, విద్యార్థులు అందరూ పాల్గొని పొగాకు రహిత భారత దేశ నిర్మాణం కోసం కృషి చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, బి.నాగేశ్వరరావు, డాక్టర్ నళిని, డాక్టర్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ బాలాజీ, ధర్మేంద్ర, మోహన్, నాగభూషణం ఇతర అధికారులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణకు పటిష్ట చర్యలు

విశాఖ సిటీ: నగరంలో పొగాకు నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎండీ, సీఐఐకి ప్రాతినిథ్యం వహిస్తున్న డాక్టర్ మురళీ కృష్ణ, సీఐఐ యంగ్ ఇండియన్ విభాగం ప్రతినిధి హర్షనందన్, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీని కలిశారు. పొగాకు రహిత భారతదేశం కోసం మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ బృందం రూపొందించిన రెండు పోస్టర్లను ఈ సందర్భంగా సీపీ ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ ఆస్పత్రికి సంబంధించిన పొగాకు విరమణ (డి–అడిక్షన్) క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి సంబంధించి ఈ ముఖ్యమైన సమస్యకు తగిన ప్రాధాన్యమిస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ సీపీ ఫకీరప్ప కాగినెల్లి ఆధ్వర్యంలో నగరంలో పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమాజంతో పాటు భవిష్యత్ తరాల ఆరోగ్య సంరక్షణ బాధ్యతకు ప్రాతినిథ్యం వహించే ప్రయత్నాలను అభినందించారు. భారత ప్రభుత్వం చేపట్టిన పొగాకు రహిత విద్యా సంస్థల అమలుకు సంబంధించిన పోస్టర్లను అన్ని విద్యా సంస్థల్లో ప్రదర్శించాలని డీఈవో చంద్రకళను డాక్టర్ మురళీకృష్ణ కోరారు. ఆ పోస్టర్లను ఆమెకు అందజేశారు.

పొగాకు నియంత్రణ నోడల్ అధికారిగా జాయింట్ సీపీ

నగరంలో పొగాకు నియంత్రణ బాధ్యతలను సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ జాయింట్ సీపీ ఫకీరప్పకు అప్పగించారు. పొగాకు నియంత్రణ, బహిరంగ ప్రదేశాల్లో ధూమపాన నిషేధం, మైనర్లకు పొగాకు ఉత్పత్తుల అమ్మకాల నిషేధం, ఈ–సిగరెట్స్, నోటి పొగాకు అమ్మకాల నిషేధం, విద్యా సంస్థలకు 100 మీటర్ల లోపు పొగాకు ఉత్పత్తుల అమ్మకాల నిషేధం వంటి అంశాలను జాయింట్ సీపీ పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సర్టిఫైడ్ డి–అడిక్షన్ స్పెషలిస్ట్ డాక్టర్ కీర్తి ప్రసన్న, సీఐఐ విశాఖ చైర్మన్ రాజేష్ గ్రంధి, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ ప్రతినిధి ఆస్మా, సీఐఐ విశాఖ డిప్యూటీ డైరెక్టర్ మౌళి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న క్లీనర్ల పైనుంచి వెళ్లిన లారీ

- ఎన్టీపీసీ బూడిద చెరువు వద్ద ప్రమాదం
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


వినయ్‌కుమార్ మృతదేహం (ఇన్‌సెట్) వినయ్‌కుమార్(ఫైల్)

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఫ్లైయాష్ పాయింట్ వద్ద గురువారం రాత్రి నిద్రిస్తున్న క్లీనర్ల పైనుంచి లారీ వెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ బూడిద చెరువు ఎల్–4 వద్ద గురువారం రాత్రి 11.30 గంటలకు ఫ్లైయాష్ లోడింగ్ కోసం లారీలను వరస క్రమంలో ఉంచారు. వేర్వేరు ఫ్లైయాష్ లోడింగ్ లారీల క్లీనర్లుగా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరుకు చెందిన వారా వినయ్‌కుమార్(19), అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన ఎం.దిలీప్‌కుమార్(24) పని చేస్తున్నారు. వీరిద్దరూ సీరియల్ మొదట ఉన్న లారీ ముందు ఎడమ చక్రం వైపు నిద్రించారు. ఇంతలో లోడింగ్ సీరియల్ రావడంతో లారీ డ్రైవర్ వీరు నిద్రించిన విషయం గుర్తించకుండా.. వారిపై నుంచి నడిపాడు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన తోటి డ్రైవర్లు వీరిద్దరినీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వినయ్‌కుమార్ చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. మెరుగైన చికిత్స కోసం దిలీప్‌ను కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. వినయ్‌కు వివాహం కాలేదు. దిలీప్‌కు మూడేళ్ల కిందట వివాహం కాగా.. రెండేళ్ల కుమార్తె ఉంది. వినయ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు చెప్పారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి వినయ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గాయపడిన దిలీప్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు.